## క్లుప్తంగా

### ఒంగోలు వెళ్లి పింఛన్ పంపిణీ



బంగారమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బాబ్జి

చీరాల టౌన్: వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదలకు మేలు జరుగుతోందనడానికి నిదర్శనాలు ఎన్నో. వాడరేవుకు చెందిన ఒసిపిల్లి బంగారమ్మ అనారోగ్యానికి గురై ఒంగోలులోని రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. పింఛన్ లబ్ధిదారురాలైన బంగారమ్మ రెండు నెలల పాటు పింఛన్ తీసుకోకపోవడంతో వాడరేవు–2 వలంటీర్ యజ్జల బాబ్జి బంగారమ్మ ఒంగోలు రిమ్స్‌లో చికిత్సపొందుతున్న విషయం తెలుసుకుని మంగళవారం ఆసుపత్రికి వెళ్లి డిసెంబర్ పింఛన్, జనవరిలో పెరిగిన పంఛన్ మొత్తం బంగారమ్మకు రూ.5250ను అందించారు. ఈసందర్భంగా ఆమె ప్రభుత్వానికి, వలంటీర్ కృతజ్ఞతలు తెలిపింది.

### అందరి భాగస్వామ్యంతో క్లీన్ ఆంధ్ర

చీరాల టౌన్: పరిసరాల పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని, అందరి భాగస్వామ్యంతోనే క్లీన్ ఆంధ్ర సాధ్యపడుతుందని సాల్మన్ సెంటర్ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వీధుల్లో చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

### ఉమామహేశ్వరరావుని స్ఫూర్తిగా తీసుకోవాలి



క్రీడాకారుడిని అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వేటపాలెం: అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచి జిల్లాకు పేరు తెచ్చిన గాత్రం ఉమామహేశ్వరరావుని క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. అథ్లెటిక్ పోటీల్లో జిల్లా నుంచి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనర్చిన క్రీడాకారులను ఒంగోలులో కలెక్టర్ అభినందించారు. డిసెంబర్ 16, 17 తేదీల్లో నెల్లూరులో రాష్ట్రస్థాయిలో జరిగిన 41వ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో వేటపాలేనికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉమామహేశ్వరరావు 45 ప్లస్ ఏజ్‌లో జరిగిన 5 కిలో మీటర్ల పరుగు పందెంలో రెండో, ట్రిపుల్ జంప్‌లోనూ ద్వితీయ, 800 మీటర్లు పరుగు పందెంలో తృతీయ బహుమతి సాధించాడు.

### జెడ్పీటీసీ భవానికి ప్రముఖుల నివాళులు



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

పర్చూరు: పర్చూరు జెడ్పీటీసీ కొల్లా గంగా భవానీ మృత దేహానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని నాగుల పాలెం గ్రామంలోని జెడ్పీటీసీ గంగా భవానీ ఇంటికి మంగళవారం ఆమె స్వయంగా వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ రావి పద్మావతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావి రామనాథంబాబు, మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి, చినగంజాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు టీ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొని గంగాభవానీ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

### సమాజ సేవకులను గుర్తించుకోవాలి

చినగంజాం: సమాజంలో తమ సేవలను అందించి తోటి వారికి సాయపడిన వ్యక్తులను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని విశ్రాంత ఎలక్ట్రికల్ ఈఈ కుర్రు రామసుబ్బారావు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఆధ్వర్యంలో పాస్టర్ చిలక బెంజిమన్ 9వ వర్ధంతి సందర్భంగా మంగళవారం చర్చి చైర్మన్ చుండూరి కళ్యాణ్ కుమార్ 70 మంది వితంతు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్‌లు రాజేష్, లక్ష్మీ, ఉపాధ్యాయులు కుమార్, నరసింహారావు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న కళ్యాణ్ కుమార్

# సావిత్రిబాయి మహిళా లోకానికి ఆదర్శం

- పాఠశాలల్లో ఘనంగా సావిత్రిబాయి జయంతి
- నివాళులర్పించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు



సంతమాగులూరు: చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో



అద్దంకి: మాట్లాడుతున్న ఎస్సై ఆదిలక్ష్మీ





కారంచేడులో సావిత్రిబాయి పూలే వేషధారణలో...



అద్దంకి: మాట్లాడుతున్న నాయకులు

అద్దంకి/అద్దంకి రూరల్: దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఎంఈవో కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంఈవో మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సమాజానికి మేలు చేసిన మహిళ పూలే అని కొనియాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహిళ అన్నారు. ఆమె మహిళా చదువు కోసం ఎంతగానో కృషిచేసి వారికి చదువు చెప్పి చైతన్య కలిగించారన్నారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయురాలు వలీఖాన్, శేఖర్ పాల్గొన్నారు.

☛ సంతమాగులూరు మండలంలోని పలు చోట్ల సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా బొమ్మనంపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పూటుకూరు శ్రీనివాసులు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆమె గొప్పదనాన్ని వివరించారు. చదువు ద్వారానే సమాజంలో అసమానతలు తొలగుతాయని నమ్మిన సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, కోవి శ్రీనివాసరావు, నూకతోటి కుమారస్వామి, పీ శంకర రావు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, జే హనుమంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ సావిత్రిబాయి పూలే జయంతిని కేవీపీఎస్ జన విజ్ఞాన వేదిక, వ్యవసాయ కార్మికసంఘం, అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో టీవీ రాఘవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అద్దంకి టౌన్ ఎస్సై ఆర్. ఆదిలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా సావిత్రిబాయి పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుడు కె. రవిచంద్రబాబు, తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేశంలో మొట్టమెదటి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ విద్యాభివృద్ధికి కృషిచేసిన మొట్టమెదటి మహిళా సావిత్రిబాయి పూలే అని బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేరం సత్యం, ఎమ్మెల్సీ అభ్యర్థి వీరభద్రాచారి పాల్గొన్నారు.

**మహిళలకు సావిత్రిబాయిపూలే ఆదర్శం**

కారంచేడు: మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, ధైర్యశాలి సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి ఆదర్శమని మండలంలోని కుంకలమర్రు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పద్మావతి అన్నారు. మంగళవారం కాంప్లెక్స్ పరిధిలోని మహిళా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయిపూలే జయంతి పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కారంచేడు ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని సావిత్రీబాయి పూలే వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావి పద్మావతి, పీ నాగమణి, మార్తమ్మ, కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను స్థానిక గన్నవరం రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక హర్షిణి విద్యా సంస్థలో మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉపాధ్యాయినులు నిర్మల, కామాక్షిలను ఘనంగా సత్కరించారు.

**సావిత్రిబాయి సేవలు మరువలేనివి..**

చీరాల అర్బన్: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం బి.సాల్మన్ మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధి కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. అనంతరం హిందీ ఉపాధ్యాయురాలు కె.సుశీలను ఘనంగా సత్కరించారు.

అలానే స్థానిక సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు ఎ.నాగవీరభద్రాచారి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె హరిహరరావు, మాజీ సర్పంచ్ వూటుకూరి వెంకటేశ్వర్లు, ఎ.ప్రభాకరరావు, శర్మ తదితరులు పాల్గొన్నారు.



మార్టూరులో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



పేరాల హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న సహచరులు

## మంత్రులను కలిసిన శాప్‌నెట్ చైర్మన్



వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన చైతన్య



సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జునతో చైతన్య

అద్దంకి: రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనిని చిలకలూరిపేటలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అదే విధంగా సాంఘిక సంక్షేమ శాఖమంత్రి మేరుగ నాగార్జునను మర్యాద పూర్వకంగా కలిసి ఇరువురు మంత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్బీకే ఉద్యోగిపై అధికారుల విచారణ

యద్దనపూడి: రైతు భరోసా కేంద్రం ఉద్యోగి అవినీతి ఆరోపణలపై మంగళవారం అధికారులు విచారణ చేశారు. మండలంలోని అనంతవరం రైతు భరోసా కేంద్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కాసా దానియేలు అవినీతి బాగోతంపై మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన రైతులు సోమవారం యద్దనపూడి పోలీసులకు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకటరెడ్డి, ఏడీఏ మోహనరావు, వ్యవసాయాధికారి ఆదినారాయణ ఇతర అధికారులు అనంతవరంలోని ఆర్బీకే కేంద్రాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా ఆర్బీకే గోడౌన్‌లో ఉండాల్సిన కాంప్లెక్స్ ఎరువులు 250 బస్తాలు, 30 బస్తాల యూరియా అదృశ్యమైనట్లు అధికారులు గుర్తించారు. ఇంత జరిగినా దానియేలు ఆచూకీ తెలియకపోగా ఫోన్ సైతం అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఈ క్రమంలో దానియేలు అవినీతిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శేషుబాబు, మహిళా పోలీస్, సచివాలయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

## నదీతీరంలో ఇసుక తీస్తే రైతులకు నష్టం

**వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు వైవీ భద్రారెడ్డి**

అద్దంకి: గుండ్లకమ్మ నదిలో భారీ యంత్రాలతో ఇసుక తీస్తే రైతుల పొలాలకు, డ్యామ్‌కు నష్టం కలుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు వైవీ భద్రారెడ్డి అన్నారు. వెంటనే సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునరెడ్డితో మాట్లాడి ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయించాలని కోరారు. మండలంలోని మణికేశ్వరం గ్రామం, అనమనమూరు గ్రామాల సమీపంలోని నది పరిసర గ్రామాల రైతుల వినతి మేరకు ఆయన మంగళవారం నది వద్దకు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ డ్రెడ్జర్‌తో ఇసుక తీయడం సరికాదన్నారు. ఇప్పటికే గుండ్లకమ్మ డ్యామ్ వద్ద గేట్లు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. కాబట్టి ఇసుక తవ్వకాలు ఆపాలని కలెక్టర్‌కు కూడా చెప్పామన్నారు. సమావేశంలో మణికేశ్వరం గ్రామస్తులు ఈదా శ్రీనివాసరెడ్డి, సోమా శ్రీనివాసరెడ్డి, అనమనమూరు నాయకుడు జంపు హరిబాబు తదితరులు ఉన్నారు.



నది తీరాన్ని పరిశీలిస్తున్న వైవీ భద్రారెడ్డి

### పెరటి కోళ్ల ద్వారా ఆర్థికాభివృద్ధి

జే.పంగులూరు: పెరటి కోళ్ల పెంపకం ద్వారా, డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని స్వయం సహాయక సంఘ సభ్యులకు 100 యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పెరటి కోళ్లను పెంచటం ద్వారా మహిళలకు మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఒక్కో యూనిట్ విలువ రూ. 4800 ఇందులో తొమ్మిది పెట్టలు, మూడు పుంజులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిపూడా నాగేంద్రంరామారావు, సీసీలు దాసు, కృష్ణవేణి, కామేశ్వరరావు, వివోఏలు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. వైఎస్సార్ పెరటి కోళ్ల పెంపకం పథకంలో భాగంగా మంగళవారం సంతమాగులూరు మండలంలో వెలుగు కార్యాలయం వద్ద మహిళా సంఘ సభ్యులకు కోళ్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ,గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్థానిక నేతలు, పాల్గొన్నారు. మండలంలోని ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘ సభ్యులకు, కలవకూరు, శాంతినగర్, కుంకుపాడు, తిమ్మాయపాలెం గ్రామాల్లోని స్టాక్ పాయింట్‌లకు పెరటి కోళ్లను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఎంపీపీ అవిశెన జ్యోతి పాల్గొన్నారు.

### రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవోలు

బల్లికురవ: ఇటీవల సంభవించిన మాండూస్ తుఫాన్‌తో తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తహసీల్దార్ పీ. సీతారత్నం, వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి తెలిపారు. మంగళవారం గుంటుపల్లి అంబడిపూడి, చెన్నుపల్లి, గ్రామాల్లో ఎన్యూమరేషన్ చేసిన వరిపంట, కుప్పలను రీ వెరిఫికేషన్ చేశారు. మండలంలో 130 ఎకరాల్లో వరి పంట మాత్రమే నష్టం వాటిల్లిందని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్‌బీకెల్లోని వీఏఏల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు పంట ఉత్పత్తులను అమ్ముకోవద్దన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని వీఆర్ఏలు, వీఏఏలే పాల్గొన్నారు.

### కోడి పందెం శిబిరంపై దాడి

వేటపాలెం: సముద్రతీరం వద్ద నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్సై జి సురేష్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని రామచంద్రాపురం శివారులో కోడి పందేల శిబిరంపై తమ సిబ్బందితో కలసి దాడి చేయగా పందేలు నిర్వహిస్తున్న నిర్వహకులు పారిపోయారని తెలిపారు. అక్కడే ఉన్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.1200 నగదు, అ ప్రాంతంలో వదిలి వెళ్లిన పది మోటార్ బైక్‌లు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కోడి పందేలు నిర్వహించినా ఆడినా కటిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

### 140 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పర్చూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం ఇనగల్లులో రెండు మినీ వాహనాలలో తరలిస్తున్న బియ్యాన్ని రహస్య సమాచారంతో అధికారులు ఛేదించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ శ్రీ హరి ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 140 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని చెరుకూరు తదితర రేషన్ దుకాణాల నుంచి బియ్యాన్ని సేకరించినట్లు అధికారులు తెలిపారు. రెండువాహనాలను సీజ్ చేసి ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోనికి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితులపై కేసులు నమోదు చేయనున్నట్లు, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై పీడీ కేసులు నమోదు చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

### ఇన్‌చార్జి ఆర్ఐగా బాధ్యతల స్వీకరణ

చీరాల టౌన్: మండల ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా వాడరేవు వీఆర్వోగా పనిచేస్తున్న శేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతుల్లో చీరాల ఆర్ఐగా పనిచేస్తున్న డీ.శ్రీకాంత్‌కు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతిపై చినగంజాంకు బదిలీ కావడంతో చీరాల మండలానికి ఇన్‌చార్జి ఆర్ఐగా శేఖర్‌ను ఉన్నతాధికారులు నియమించారు.

### రుధిర క్షేత్రాన్ని సందర్శించిన చింతా మోహన్

చీరాల రూరల్: మండల పరిధిలోని విజయనగర్ కాలనీలోగల కారంచేడు మృత వీరుల రుధిర క్షేత్రాన్ని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృత వీరులకు నివాళులర్పించారు. వీరుల ఆశయాలను నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## వైఎస్సార్ సీపీ పాలనలో అంతా సుభిక్షం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

- 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

చీరాల: వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి ముందుకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం రాత్రి చీరాల పట్టణంలోని 13వ వార్డులోని థామస్‌పేట సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు వార్డు సచివాలయంలో సంప్రదించాలన్నారు. నంతరం వార్డులోని ప్రతి గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వం అన్నీవర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయాని అని అడిగి తెలుసుకున్నారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి మూడేళ్లుగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వార్డు నాయకులు కట్టా చంద్ర, కొణిదల బుజ్జి, దేవరపల్లి మేరి, ఎరిచర్ల తిమోతి, దేవరపల్లి దావీదు, సలగల అమృతరావు, బొనిగల భాను, వీ.శ్రీను, వాసు, మాతట్టి కిషోర్, సయ్యద్ అమీర్, షేక్ అల్లాబక్షి, ఆర్‌బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి, కౌన్సిలర్లు, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## మాట తప్పని సీఎం మన జగనన్న



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి: ఎన్ని అవాంతరాలు వచ్చినా ఇచ్చిన మాట మీద నిలబడిన గొప్ప నాయకుడు మన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆయన మంగళవారం సంతమాగులూరులోని మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానం మేరకు అంచెలంచెలుగా పింఛన్‌ను పెంచడమే కాకుండా అర్హత కలిగిన వారందరికీ కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హత లేని వారిని గుర్తించడంలో భాగంగా కొంతమందికి నోటీసులు జారీ అయితే దాన్ని ప్రతిపక్షం గోరంతలు కొండంతలు చేస్తోందన్నారు. అనర్హులు ఉంటే తప్ప ఎవరికి పింఛన్ పోదన్నారు. ఎక్కడైనా పొరబాట్లు జరిగితే అధికారుల దృష్టికి తీసుకొస్తే పింఛన్‌ను పునరుద్ధరిస్తారని చెప్పారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. అధికార పార్టీ ఎన్ని మంచి పనులు చేసిన ప్రతిపక్షాల కళ్లకు కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మండల కన్వీనర్లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీ విభాగాల నాయకులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, ఎంపీడీవో సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో మామ, అల్లుడికి గాయాలు

మార్టూరు: విద్యుత్ షాక్‌తో మామా అల్లుళ్లు గాయపడిన ఘటన మార్టూరులో మంగళవారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ అందించిన వివరాలు మేరకు.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుక పెంద్రా రాజు గృహ నిర్మాణం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో రాజు తన మామ బాబు స్టూలు వేసి పట్టుకొని నిలబడగా రాజు ఇనుప స్టూలుపై నిలబడి పనిచేస్తున్నాడు. ఇంటి పైనున్న విద్యుత్ వైర్లు రాజుకు తగలడంతో మామా అల్లుళ్లు ఇద్దరు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డారు. 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం బాధితులు ఇరువురిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### సస్యరక్షణ చర్యలతో దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

మార్టూరు: మొక్కజొన్న రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బొల్లాపల్లి గ్రామంలో మొక్కజొన్న రైతులతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని భూములలో ధాతులోపం ఎక్కువగా ఉన్నదని నివారణకు జింక్, మెగ్నీషియం పంటపై పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కేవీ సుదర్శనరాజు, ఏఓ కిరణ్‌కుమార్, స్థానిక రైతులు రైతు సంఘం నాయకులు వీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.